3న ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో 'దత్తన్న అలయ్‌బలయ్'

హైదరాబాద్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దసరా సందర్భంగా అక్టోబరు 3న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో 'దత్తన్న అలయ్‌బలయ్' నిర్వహిస్తున్నట్లు అలయ్‌బలయ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బండారు విజయలక్ష్మి తెలిపారు. దసరా సమ్మేళనం-2025 పేరిట జరుగనున్న ఈ వేడుకలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, రాజకీయ పార్టీల అగ్రనేతలు, వివిధ రంగాల ప్రముఖులు హాజరు కానున్నారని ఆమె ఒక ప్రకటనలో వివరించారు.



బర్కత్‌పుర చమాన్ వద్ద స్వచ్ఛ విద్యాలయ టాయిలెట్ క్లీనింగ్ మెషీన్ ఆటోలను ప్రారంభిస్తున్న కిషన్‌రెడ్డి, కొండా విశ్వేశ్వరరెడ్డి

బర్కత్‌పురలో టాయిలెట్ క్లీనింగ్ ఆటోల ప్రారంభం

బర్కత్‌పుర, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): సర్కారు బడిలో చదివే పిల్లల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం బర్కత్‌పుర చమాన్ వద్ద స్వచ్ఛ విద్యాలయ టాయిలెట్ క్లీనింగ్ మెషీన్ ఆటోలను ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి కిషన్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, సికింద్రాబాద్ పార్ల మెంట్ నియోజకవర్గ పరిధిలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్లను శుభ్రం చేయడానికి క్లీనింగ్ మెషీన్లతో కూడిన ఆటోలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి అన్నారు.

బీసీ రిజర్వేషన్లను అడ్డుకునే వారి భరతం పడతాం: కృష్ణయ్య

బర్కత్‌పుర, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై జీవో 9 విడుదల చేయడం హర్షణీయమని, పోరాటాల ఫలితంగానే ఈ రిజర్వేషన్లను సాధించుకున్నామని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఈ రిజర్వేషన్లను ఎవరు వ్యతిరేకించినా తీవ్ర పరిణామాలు తప్పవని, వారి భరతం పడతామని ఆయన హెచ్చరించారు. రాజకీయ కోణంలో వీటిని చూడవద్దని.. అగ్రవర్ణాలు వ్యతిరేకించవద్దన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో బీసీ సంఘాల సమావేశం శనివారం నిర్వహించారు.

రైలు ప్రయాణికుడి బ్యాగును తస్కరించిన దొంగలు

బర్కత్‌పుర, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికుడి బ్యాగును దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప వివరాల ప్రకారం..నిజాంపేటకు చెందిన సుబ్రహ్మణ్య ప్రసాద్ కాచిగూడలో మైసూరు ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు, వాటర్ బాటిల్ తెచ్చుకోవడానికి బ్యాగును సీటుపై ఉంచి కిందకు దిగి, వచ్చేసరికి బ్యాగు కనిపించలేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ప్రయాణికురాలి మంగళసూత్రం చోరీ

రైలు ప్రయాణికురాలి బంగారు మంగళసూత్రాన్ని దొంగలు తస్కరించారు. గుంటూరు అగ్రహారానికి చెందిన యశ్వంత్‌కుమార్ జైన్ బిక్కనూర్- కాచిగూడ కోటి ఎక్స్‌ప్రెస్ రైలు ఉజ్జయినిలో ఎక్కగా మధ్యలో తల్లి 34 గ్రా. మంగళసూత్రాన్ని తస్కరించారు. నాందేడ్ రైల్వే పీఎస్‌కు బదిలీచేసినట్లు సీఐ తెలిపారు.



కృష్ణానగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



కృష్ణానగర్‌లో పరిశీలిస్తున్న జలమండలి సీజీఎం ప్రభు, జీఎం.వినోద్, డీజీఎం కృష్ణ తదితరులు

'మూసీ' బస్తీలు అల్లకల్లోలం

ఆకస్మిక వరదతో గోల్నాక పరిధిలోని ఇళ్లలోకి వరద నీరు

సురక్షిత ప్రాంతాలకు ప్రజల తరలింపు

కమ్యూనిటీ హాళ్లు, పాఠశాలల్లో భోజనాల ఏర్పాటు

పరిశీలించిన జీహెచ్ఎంసీ కమిషనర్, ఉన్నతాధికారులు



మూసీ పరివాహక ప్రాంతమైన అంబేద్కర్‌నగర్‌లో వరదనీరు

గోల్నాక, అంబర్‌పేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మూసీ నదిలో ఆకస్మికంగా ప్రవహిస్తున్న వరదతో గోల్నాక డివిజన్ పరిధిలోని మూసీ పరివాహక ప్రాంత బస్తీలు అల్లకల్లోలమయ్యాయి. ఇళ్లలోకి వరద నీరు రావడంతో ఆయా బస్తీల ప్రజలు అవస్థల పాలవుతున్నారు. ఇళ్లలోని వస్తువులు తడిసిపోయాయి. శుక్రవారం రాత్రి మూసీలో ఆకస్మికంగా భారీగా వరదనీరు ప్రవహించడంతో మూసీ పరివాహక ప్రాంత బస్తీలైన టక్కీజైలు సంజయ్‌గాంధీనగర్, ఫాతీమానగర్, న్యూకృష్ణానగర్, ఓల్డ్‌కృష్ణానగర్, అంబేద్కర్‌నగర్ బస్తీలలో కిందిభాగంలో ఉన్న ఇండ్లలోకి నీరు రావడంతో ప్రజలు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ఏం జరగనున్నదో అన్న ఆందోళనకు లోనయ్యారు. సమాచారం అందుకున్న అధికారులు బస్తీలకు చేరుకుని ప్రజలను కమ్యూనిటీ హాల్స్, ప్రభుత్వ పాఠశాలలకు, ఇతర భవనాలకు తరలించారు. వారికి భోజన వసతి కూడా కల్పించారు. శనివారం వర్షం కాస్త తగ్గడంతో ప్రజలు వారి ఇండ్లకు చేరుకుని నీటిని బకెట్లతో ఎత్తిపోశారు. అంబేద్కర్‌నగర్ కింది బస్తీల్లో మాత్రం నీరు అలానే నిలిచి ఉండడంతో డీఆర్ఎఫ్ ఏర్పాటు చేసిన చిన్న బోట్లలో అధికారులు, ప్రజాప్రతినిధులు తిరుగుతూ ప్రజలకు భరోసా ఇచ్చారు. జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ అంబేద్కర్‌నగర్ సందర్శించి పరిస్థితిని పరిశీలించి ప్రజలతో మాట్లాడి ప్రభుత్వ పరంగా అన్ని విధాలా సహకారం అందిస్తామని భరోసా కల్పించారు. అలాగే మూసీ ప్రవహిస్తున్న ఉద్రిక్తతను పరిశీలించారు. ఆయనతో పాటు జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సంజయ్‌గాంధీనగర్, టక్కీజైలు, కృష్ణానగర్, అంబేద్కర్‌నగర్ ప్రాంతాలలో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. మధ్యాహ్నం కృష్ణానగర్, అంబేద్కర్ నగర్‌లలో బాధితులకు ఎమ్మెల్యే భోజనాలు ఏర్పాట్లు చేశారు. కార్పొరేటర్లు దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్, పద్మావెంకటరెడ్డి, విజయకుమార్ గౌడ్, మాజీ కార్పొరేటర్ కాలేరు పద్మావెంకటేష్ కూడా పర్యటించి తమ వంతు సహాయసహకారాలు అందజేశారు. ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ కృష్ణానగర్, అంబేద్కర్ నగర్‌లో పర్యటించి పరిస్థితులను పరిశీలించారు. కృష్ణానగర్‌లో బాధితులకు సీపీఎం నేత మహేందర్ టిఫిన్స్ ఏర్పాటు చేశారు. జలమండలి సీజీఎం ప్రభు, జీఎం వినోద్, డీజీఎం కృష్ణ, ఏఈ రోహిన్ తదితరులు కృష్ణానగర్, అంబేద్కర్ నగర్ ప్రాంతాలలో పర్యటించి సమస్యలను పరిశీలించారు.

కూలిన రైల్వే ప్రహరీ.. తప్పిన పెను ప్రమాదం

సందర్శించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



కూలిన ప్రాంతాన్ని సందర్శించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, కార్పొరేటర్ యాకర అమృత



నర్సింహాబస్తీ పక్కన రైల్వే ప్రహరీ కూలడంతో ధ్వంసమైన ఆటో, కారు

నల్లకుంట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా నల్లకుంటలో రైల్వే శాఖ ప్రహరీ కూలిపోయింది. గోడకూలిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. శనివారం తెల్లవారుజామున నల్లకుంట డివిజన్ నర్సింబస్తీ, టీఆర్‌టీ క్వార్టర్స్ మధ్యలో వెళ్లే దారిలో రైల్వే ప్రహరీ గోడ నేలకూలింది దీంతో ప్రహరీ పక్కన పార్కింగ్ చేసిన రెండు కార్లు, రెండు ఆటోలు, ఐదు ద్విచక్రవాహనాలు ధ్వంసమయ్యాయి. దీంతో రైల్వే అధికారులు జేసీబీతో ప్రహరీతో ధ్వంసమైన వాహనాలను తొలగించడానికి ప్రయత్నించగా బస్తీ వాసులు అడ్డుకున్నారు. వాహనాల బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సంఘటన స్థలాన్ని సందర్శించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు.

నర్సింహాబస్తీని అనుకుని ఉన్న రైల్వే శాఖ ప్రహరీగోడ కూలిపోయి పలు వాహనాలు ధ్వంసమైన ప్రాంతాన్ని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సందర్శించి స్థానికులనడిగి వివరాలను తెలుసుకున్నారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ నర్సింహాబస్తీ, టీఆర్‌టీ క్వార్టర్స్‌కు వెళ్లే ఈ దారిలో చెత్త, చెదారం ఉండడంతో గతంలో రైల్వే ప్రహరీ నిర్మించినట్లుగా గుర్తు చేశారు. ఈ విషయంపై కేంద్ర రైల్వే మంత్రి, దక్షిణ మధ్యరైల్వే శాఖ అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. రైల్వే శాఖ కూలిపోయిన ప్రహరీ సమస్యలపై విద్యానగర్ నుంచి రత్నానగర్ వరకు రైల్వే ట్రాక్ పక్కనున్న వాటిపై నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ధ్వంసమైన వాహనాల బాధితులకు న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. నల్లకుంట కార్పొరేటర్ యాకర అమృత, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రహరీ కూలిన ప్రాంతాన్ని సందర్శించారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి



బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహా, బింగి నవీన్



కొండాలక్ష్మణ్‌కి నివాళులర్పిస్తున్న బండారు దత్తాత్రేయ, బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు వినయ్‌కుమార్, తదితరులు



బాపూజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎడ్ల హరిబాబు యాదవ్, పద్మశాలి నేతలు



ఆచార్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న పులిగారి గోవర్ధన్‌రెడ్డి

ముషీరాబాద్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం పోరాడిన గొప్ప నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహా కొనియాడారు. శనివారం కొండా లక్ష్మణ్ బాపూజీ 110 జయంతిని పురస్కరించుకొని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో అశోక్ నగర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి జైసింహా ముఖ్యఅతిథిగా హాజరై పద్మశాలి సంఘం రాష్ట్ర కోశాధికారి బింగి నవీన్‌తో కలిసి బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర సాధన కోసం, నిజాం వ్యతిరేక పోరాటం, అట్టడుగు వర్గాల సంక్షేమానికి అలుపెరుగని పోరాటం చేసిన నాయకుడు అన్నారు. బింగి నవీన్ మాట్లాడుతూ.. బాపూజీ జీవితచరిత్రను పాఠ్యపుస్తకాలలో చేర్చాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన ఆశయాలకు, పద్మశాలీల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఠాగోపాల్, ఎమ్మెల్సీ రమణ, పద్మశాలిసంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అశోక్‌నగర్‌లో..

చిక్కడపల్లి, (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం మంత్రి పదవినే త్యాగం చేసిన గొప్ప యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయం అని ప్రముఖులు పేర్కొన్నారు. బాపూజీ 110వ జయంతి సభ శనివారం అశోక్‌నగర్‌లోని బాపూజీ కన్నుమూసిన చోట పద్మశాలిప్రజాసంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు.

ముషీరాబాద్‌లో..

ముషీరాబాద్, (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాల స్ఫూర్తి ప్రదాత కొండా లక్ష్మణ్ బాపూజీ అని బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎడ్ల హరిబాబు యాదవ్ అన్నారు. కొండా లక్ష్మణ్ జయంతిని పురస్కరించుకొని ముషీరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బాపూజీ ఆశయ సాధనకు కృషిచేయాలి: గోవర్ధన్ రెడ్డి

కవాడిగూడ, (ఆంధ్రజ్యోతి): ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని తెలంగాణ పంచాయితీ రాజ్ ట్రిబ్యునల్ సభ్యులు. తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. బాపూజీ 110వ జయంతిని పురస్కరించుకొని అశోక్‌నగర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాపూజీ కలలు కన్న సామాజిక తెలంగాణ వచ్చినప్పుడే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి అన్నారు.

కమ్యూనిటీహాల్‌ను ప్రారంభించండి: మల్లేష్



మాట్లాడుతున్న మల్లేష్, సిరిగిరి శ్యామ్

రాంనగర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాంనగర్ డివిజన్‌లోని హరినగర్‌లో దివంగత నాయిని నర్సింహారెడ్డి ఎమ్మెల్సీ కోటా నిధులు రూ.78 లక్షలతో నిర్మించిన జీ ప్లస్ 1 భవనాన్ని ప్రారంభించి త్వరగా అమలులోకి తీసుకురావాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, ముషీరాబాద్ సర్కిల్ డీఎంసీ రామానుజులరెడ్డిని బీఆర్ఎస్ రాంనగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు రేషం మల్లేష్ కోరారు. శనివారం హరినగర్‌లో విలేకరుల సమావేశం లో బీఆర్ఎస్ నగర నాయకుడు సిరిగిరి శ్యామ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. కమ్యూనిటీహాల్ పూర్తయి మూడేళ్లయినా ఇప్పటికీ ప్రజోపయోగంలోకి తీసుకురాలేదన్నారు. ఈ విషయంపై సోమవారం జీహెచ్ఎంసీ కమిషనర్, డీఎంసీకి విన్నవించనున్నట్లు పేర్కొన్నారు.

బీసీ రిజర్వేషన్లపై హైకోర్టుకు వెళ్లడం వెనుక కాంగ్రెస్ నేతల కుట్ర

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నాగేష్



రాంనగర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లపై రెడ్డి జాగృతి సంస్థ హైకోర్టుకు వెళ్లడం వెనుక కాంగ్రెస్ పార్టీ నేతల కుట్ర ఉందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఎం.నాగేష్ ముదిరాజ్ ఆరోపించారు. శనివారం రాంనగర్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో 9 తీసుకురావడంపై రెడ్డి జాగృతి సంస్థ హైకోర్టులో లంచ్ మోషన్‌లో పిటిషన్ వేయడం తగదన్నారు. ఈ సంస్థ కాంగ్రెస్ పార్టీకి సీఎం రేవంత్‌రెడ్డికి సంబంధించిన సంస్థ అని ఆరోపించారు.

రోజుకో అవతారంలో అమ్మవారు..

ఐదవరోజు ఘనంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు



కవాడిగూడలో లలితాదేవిగా..



గోల్నాకలో గౌరీదేవిగా..



లలితానగర్‌లో శ్రీమహాలక్ష్మిగా..



ఆర్టీసీక్రాస్‌రోడ్ లక్ష్మీగణపతి ఆలయంలో అన్నపూర్ణాదేవిగా దుర్గామాత



పటేల్‌నగర్‌లో అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



గాంధీనగర్‌లో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్



గాంధీనగర్‌లో దుర్గామాత పూజల్లో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు



బాపూజీ నగర్‌లో కార్పొరేటర్ సుప్రియా నవీన్ గౌడ్